


పత్తి 12 తేమ శాతం ఎత్తివేయాలి

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి



# హెలీ మాగ్నెటిక్ సర్వే

## ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ కోసం



**ప్రజాపక్షం/దేవరకొండ :** రాష్ట్ర ప్రగతి దిశగా అడుగులు వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం, సైన్స్ ఆధారిత పద్ధతుల్లో నీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేస్తోంది. ఈ క్రమంలో ఎస్‌ఎల్‌బిసి (సజ్జల కాలువ బిహేవియర్ కెనాల్) టన్నెల్ నిర్మాణ పనుల భద్రతా అంశాలపై సమగ్ర పరిశీలన కోసం ఏరియల్ ఎలక్ట్రోమాగ్నెటిక్ (హెలిబోర్న్ మాగ్నెటిక్) సర్వే సోమవారం ప్రారంభమైంది. ఈసర్వేను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల, సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్, అచ్చంపేట ఎంఎల్‌ఏ డా. వంశీకృష్ణలు ఎన్‌జీఆర్‌ఐ (నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ ఈసర్వేలో 200 కిలోమీటర్ల మేర హెలికాప్టర్ ఫ్లైయింగ్ షెడ్యూల్ రూపొందించబడిందని 24 మీటర్ల వ్యాసంతో ఉన్న స్పెషల్ ట్రాన్స్‌మీటర్ సాయంతో భూమి అడుగున 1000మీటర్ల లోతు వరకు జియోలాజికల్ డేటా సేకరించనున్నారని తెలిపారు. ఈ హైటెక్ సర్వే ద్వారా టన్నెల్ మార్గంలో ఉన్న షీర్‌జోన్‌లు, నీటి ప్రవాహాలు, భూగర్భ లోపాలు వంటి అంశాలను ఖచ్చితంగా గుర్తించవచ్చని అన్నారు. టన్నెల్ భద్రత, నాణ్యతకు శాస్త్రీయ ఆధారిత మానిటరింగ్ ద్వారా ఇది ప్రపంచ స్థాయి ఇంజనీరింగ్ ప్రాజెక్టుగా నిలుస్తుందని తెలిపారు. 2025 ఫిబ్రవరిలో జరిగిన దుర్ఘటనలో 8 మంది కార్మికులు ప్రాణాలు కొల్పోయిన ఘటన నేపథ్యంలో, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం అత్యంత జాగ్రత్తలు తీసుకుంటోందని తెలిపారు. ఈదిశగా సాంకేతిక కమిటి సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించగా, టన్నెల్ పనులను మరింత శాస్త్రీయంగా కొనసాగించేందుకు లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్‌సింగ్ కు ప్రత్యేక సలహాదారుగా, కర్నల్ పరక్షిత్ మెహ్రా టన్నెల్ స్పెషలిస్టుగా నియమించారని గుర్తు చేశారు. టన్నెల్ నిర్మాణం విజయవంతమైతే, తెలంగాణ రాష్ట్రం ప్రపంచ ఇంజనీరింగ్ మ్యాప్‌లో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది కేవలం నీటి ప్రాజెక్టు మాత్రమే కాకుండా, తెలంగాణ ప్రజల కలల ప్రాజెక్టని అభివర్ణించారు. దేవరకొండ, అచ్చంపేట నియోజకవర్గాల మధ్య సజావుగా అనుసంధానం ఏర్పడేలా వంతెనలు, రహదారులు, అనుబంధ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయనున్నామని ఎంఎల్‌ఏ బాలునాయక్ తెలిపారు.



## అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే సమస్యలు పరిష్కారం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అధికారులు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కె సీతారామారావుతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులు చాలా శాఖలలో పెండింగ్‌లో ఉన్నాయని అట్టి శాఖల జాబితాను ప్రజావాణి గ్రూపులో చేర్చడం జరుగుతుందన్నారు. అక్టోబర్ నెలలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు తక్కువగా ఉన్నాయని దానిని సరిచేసుకోవాలన్నారు. హుజూర్‌నగర్‌లో జరిగిన మెగాజాబ్‌మేళాను విజయవంతం చేసిన అధికారులను ఆయన అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రజావాణికి 67 దరఖాస్తులు రాగా వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఇఓ అశోక్, సంక్షేమ అధికారులు నరసింహారావు, శంకర్, శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డి శ్రీనివాస్, హౌజింగ్ పిడి సిద్ధార్థ, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు పంటలు ధ్వంసం

రైతాంగాన్ని ఆదుకోవాలని జిల్లా కలెక్టరేట్ ముందు యాదాద్రి జిల్లా తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా, కలెక్టర్‌కు వినతిప్రతం

బ్యాంకులు ఎలాంటి షరతులు, వడ్డీ లేకుండా రుణాలు ఇవ్వాలని : యానాల




# సెట్విన్ ద్వారా వృత్తిపరమైన కోర్సుల శిక్షణ

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ :** పది,ఇంటర్ చదువు తర్వాత విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందేందుకుగాను సెట్విన్ ఆధ్వర్యంలో వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.ఈ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు,కేజీబీవీలు, మోడల్ స్కూల్ విద్యార్థులకు మండలాల ప్రత్యేక అధికారులు, సంక్షేమ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేకించి మహిళలకు ఉద్దేశించి బ్యూటిఫికేషన్, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి కోర్సులు కూడా ఇందులో ఉన్నాయని తెలిపారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం ఆమె జిల్లా అధికారులతో మాట్లాడుతూ సెట్విన్ ద్వారా కల్పించే వృత్తిపరమైన కోర్సుల శిక్షణలో భాగంగా ఈనెల 4న నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని రామ్ నగర్ అల్పసంఖ్యాక వర్గాల రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రారంభిస్తున్నట్టు ఆమె తెలిపారు.సెట్విన్ ఇచ్చే శిక్షణ కోర్సులలో భాగంగా సుమారు( 26) రకాల కోర్సులు ఉన్నాయని, వాటిలో కంప్యూటర్ కోర్సులు, మహిళలకు ఉద్దేశించిన ప్రత్యేక కోర్సులు, ఎడ్యుకేషన్ కోర్సులు,టెక్నికల్ కోర్సులు ఉన్నాయని,ఇవన్నీ 3 నుండి 6 నెలల స్వల్పకాల వ్యవధి శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని, వెల్లడించారు.ఈ శిక్షణా కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని చెప్పారు.ఈ సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,ఇన్చార్జి డిఆర్ఓ వై. అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్,చండూరు,దేవరకొండ ఆర్‌డిఓలు శ్రీదేవి,రమణారెడ్డి,జిల్లా అధికారులు ఉన్నారు.

**బాల్యవివాహాలు జరగకుండా పకడ్బందీ చర్యలు**

మండల ప్రత్యేక అధికారులు మండలాలలో సుడిగాలి పర్యటనలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చెప్పారు.ధాన్యం సేకరణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు.సోమవారం ఆమె ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఇటీవల కాలంలో జిల్లాలో అక్కడక్కడ ఆడపిల్లల విషయంలో జరుగుతున్న సంఘటనలు,బాల్యవివాహాలను దృష్టిలో ఉంచుకొని ఇకపై అలాంటివి జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని,ఇందుకుగాను మండలాలలోపాఠశాలలు, విద్యాసంస్థలు సందర్శించినప్పుడు వారికి అవగాహన కల్పించాలని, ఎవరైనా ఆడపిల్లల పట్ల అత్యాచారాలకుపాల్పడినట్లయితే కఠినంగా శిక్షించబడతారన్న విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలన్నారు.ఈ సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, ఇన్చార్జి డిఆర్ఓవై. అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, ఆర్డీవోలు, జిల్లా అధికారులు హాజరయ్యారు.



# అన్నదానం మహాదానం


**ప్రజాపక్షం/ కోదాడ:** పట్టణ పరిధి అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం మాలధారులకు నిత్యన్న దాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి చల్లా రామూర్తి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా దాతల సహకారంతో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం తొలి రోజు ఇమ్మడి అనంత సూర్యాప్రకాశ్‌రావు జ్ఞాపకార్థం ధర్మపత్ని, కుమారుడు రమేష్, సంధ్యలు మాలధారులకు అన్నదానం చేశారు. అనంతరం ఆలయ కమీటి వారు దాతలను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అనంతచక్రవర్థి, ధర్మపత్ని సాయిసౌందర్య, కుమార్తె చక్రశ్రీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా వాలీబాల్ జట్టుకు చిమిర్యాల విద్యార్థి ఎంపిక



**ప్రజాపక్షం/ కోదాడ:** సూర్యాపేట జిల్లా కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎస్.జీ.ఎఫ్ వారి అధ్వర్యంలో అండర్ 14 జిల్లా వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో అద్భుత ప్రతిభచాటిన కోదాడ మండల పరిధి చిమిర్యాల ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.కె మహబూబ్ జాని జిల్లా జట్టుకు ఎంపికైన్నట్లు పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు పి.కళ్యాణ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని హెచ్ఎం డా॥ శరత్‌బాబు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

# రూ.10వేలు పెనాల్టీ


సూర్యాపేట పురపాలక సంఘం
చిల్లర రశీదు
MISCELLANEOUS RECEIPT
M.F. No. 52 (Carbon)
028718
రెండవ ప్రతి
తేది
శ్రీ
గారి నుండి
రూ॥ 10,000/-
అక్షరాల
మాత్రమే
నిమిత్తం ముట్టినవి.
లెక్క బాపతు
అకౌంటెంటు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణంలోని యంజి రోడ్డు నందు సోమవారం అట్టహాసంగా ప్రారంభమైన గోల్డ్ షాప్ యాజమాన్యం వారు ప్రారంభం సందర్భంగా తమ షాప్ ముందు రోడ్డుపై మెరుపు కాగితాలు పోసి రోడ్డు ప్రాంతాన్ని చెత్తాచెదారం చేసినందుకు గాను మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. హన్మంతరెడ్డి ఆదేశాల మేరకు రూ.10వేలు పెనాల్టీ వేశారు. పట్టణంలో అనుమతి లేకుండా ఫ్లెక్సీ, బ్యానర్లు పెట్టినందుకు ఆదివారం రోజున రూ.10వేలు ఫెనాల్టీ వేసినట్లు సంబంధిత మున్సిపల్ అధికారులు తెలిపారు.

# నేడు రెడ్డి గట్టు శేషయ్య వర్ధంతి

**ప్రజాపక్షం/మోటకొండూరు :** అమరజీవి, తెలంగాణా సాయుధ పోరాటయోదుడు రెడ్డిగట్టు శేషయ్య వర్థంతి నేడు మండల కేంద్రంలో మోటకొండూరు గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సిపిఐ శ్రేణులు, మండల కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ శాఖ కార్యవర్గం కౌన్సిల్ పార్టీ కార్యకర్తలు హజరు కావాలని మండల సిపిఐ సహాయ కార్యదర్శి బాలరాజు పిలుపునిచ్చారు.

# నేడు రాజ్యాధికార పార్టీ మూడవ సమావేశం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నేడు నల్లగొండ లోని ఎస్‌బి ఆర్ గార్డెన్‌లో నిర్వహించే రాజ్యాధికార పార్టీ మూడవ సమావేశానికి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరు కానున్నారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వట్టే జానయ్య యాదవ్, సూర్యారావు తెలిపారు. సోమవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలోఎస్‌బిఆర్ గార్డెన్‌లో మీ ప్రశ్న మా సమాధానం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి తీన్మార్ మల్లన్న ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల ప్రశ్నలకు ప్రత్యక్షంగా సమాధానం ఇవ్వనున్నారని అనంతరం ఎంజేయూ విద్యార్థులతో టాక్ విత్ మల్లన్న పేరుతో ప్రత్యేక చర్చ జరగనున్నదని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జరిపోతుల రమేష్ గౌడ్, వంటేపాక యాదగిరి, వల్లభాయ్ శివ,మేడబొయి న సాయి కుమార్. తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర



**ప్రజాపక్షం/ రామన్నపేట:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర లభిస్తుందని పీఏసీఎస్ ఛైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రామన్నపేట గ్రామపంచాయతీ పరిధిలోని బీరప్ప గుడి ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్ పెద్దగోని వెంకటేశ్, తహసీల్దార్ లాల్ బహదూర్, ఎంపీడీవో రాములు, ప్రజాప్రతినిధులు గొరిగే నర్సింహా, జమీరొద్దిన్, బండ శ్రీశైలం, మోటె లక్ష్మయ్య, జీపీవో కొమ్ము నర్సింహా, మండల సమాఖ్య అధ్యక్షురాలు మౌనిక పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్ 42 శాతం అమలు చేయాలని వినతి




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో బిసి రిజర్వేషన్ సాధన సమితి, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మరియు ధర్మసమాజ్ పార్టీ, బీసీ సంఘాల మద్దతుతో నారాయణపురం తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన 42 శాతం బీసీ రిజర్వేషన్స్ అమలు గురించి వెనువెంటనే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రపతి ఆమోదం పొందేలా కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి ఈ శీతాకాల సమావేశంలో 9వ షెడ్యూల్లో చేర్పించి రాజ్యాంగ సవరణ ద్వారా బీసీలకు దైవ శాసనమైన పార్లమెంట్లోనే చట్టం చేసి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర బీసీ ప్రజలకు బహుమానంగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ జిల్లా కన్వీనర్ శాంతి కుమార్, జిల్లా నాయకులు గాలయ్య, లింగస్వామి, ఎంజెఎస్ నాయకులు జలంధర్, మండల నాయకులు కిరణ్, సందీప్, నాగేష్, శివాజీ, సందీప్,నరేష్, అరుణ్ ,మధు తదితరులు పాల్గొన్నారు.

# మేళ్లచెరువు కట్ట ప్రమాదాన్ని ముందుగానే గుర్తించిన రైతులు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం మేళ్లచెరువు కట్ట ప్రమాదంలో ఉన్నదని గుర్తించిన స్థానిక రైతులు, సీపీఐ నాయకులు ఇరిగేషన్ డిఈ, తహసిల్దార్‌లకు చెరువు నీటి ఒత్తిడి పెరగడంతో కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని ఫోన్ ద్వారా అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఇరిగేషన్ ఏఈ జానయ్య, సాంకేతిక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదాన్ని నివారించేందుకు అత్యవసరంగా జెసిబి యంత్రంతో మరమ్మతు పనులు చేపించి, కట్ట పక్కన తడి మట్టి ముంచుకొస్తున్న నీరు కారణంగా పనులు కష్టంగా సాగినా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు. చెరువును శాశ్వతంగా బలపరిచే దిశగా తక్షణమే చెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభించేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు కోరారు.

# 4న పర్యావరణహిత బజార్

**ప్రజాపక్షం/ రామన్నపేట:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రామన్నపేట తెలంగాణ నేషనల్ గ్రీన్ కాప్స్ సహకారంతో ఈనెల 4న పర్యావరణహిత బజార్‌ను నిర్వహిండచం జరుగుతుందని ప్రిన్సిపాల్ ఆచారన్య రాహత్‌ఖానం సోమవారం తెలిపారు. పర్యావరణ అనుకూలంగా వస్తువులను వినియోగిస్తూ పర్యావరణాన్ని కాపాడే ఉద్దేశ్యంతో పండుగలు జరుపుకోవాలని, అందుకోసం పర్యావరణహిత వస్తువులను వినియోగించకోవాలని, విద్యార్థులు తయారు చేసి వివిధ వస్తువులైన ప్రమిదలు, అల్లికలు, హస్తకళ వస్తువులు, పండుగకు కావాల్సిన వివిధ రకాల తెలంగాణ పిండి వంటలు ఈ బజార్‌లో అమ్మడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి వివిధ పాఠశాలల విద్యార్థులు, జూనియర్ కళాశాలల విద్యార్థులు కూడా పాల్గొంటారని పర్యావరణ హిత బజార్‌ను విజయవంతం చేయాలని కోరారు.



# మానవత్వం చాటుకున్న పోలీస్ లింగయ్య

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మానవత్వంతో తనకు దొరిగిన రూ.1లక్షా50వేలను బాధితునికి అందజేసిన సంఘటన సోమవారం సూర్యాపేట పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో ఓ బంగారు దుకాణం ఓపెనింగ్ సందర్భంగా ప్రజలు ఎక్కువగా వస్తారనే ఉద్ధేశ్యంతో స్పెషల్ పార్టీ సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా అక్కడికి వచ్చిన ఒక వ్యక్తి నగదు రూ.1.50వేలు పోగొట్టుకున్నాడు. అక్కడే విధుల్లో ఉన్న సూర్యాపేట జిల్లా స్పెషల్ పార్టీ అర్మడ్ హెడ్‌కానిస్టేబుల్ లింగయ్యకు దొరికినవి. దొరికిన నగదును సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది సాయంతో బాధితునికి అందజేసి లింగయ్య తన మానవత్వాన్ని చాటుకున్నారు. బాధితుడు మోతె మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించడం జరిగింది. నిజాయితీ చాటుకున్న హెడ్‌కానిస్టేబుల్ లింగయ్యను పోలీసు అధికారులు, ప్రజలు అభినందించారు.

# ధాన్యం కొనుగోలు నిర్వహించాలి



**ప్రజాపక్షం/అర్వపల్లి :** ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి పరిమితమయ్యాయి తమ ధాన్యమును కాంటాలు నిర్వహించడం లేదని మండల కేంద్రంలోని జాజిరెడ్డిగూడెం గ్రామంలో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యమును తీసుకవచ్చి నెల కావస్తుందని మరోవైపు గత కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షం కారణంగా తేమ శాతం పెరిగిపోయిందన్నారు. తిరిగి ధాన్యాన్ని ఆరబోశామని మళ్ళీ వర్షాలు ప్రారంభమవుతున్నాయి కానీ అధికారులు మాత్రం ధాన్యం కొనుగోలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బొల్లం యాదగిరి, మామిడి రాజ్‌కుమార్, గట్టిగొర్ల గణేష్, ఆరూరి శ్రీను, మాదగాని రాంమ్మూర్తి, మాదగాని వెంకన్న, పగిడిమర్రి లక్ష్మమ్మ, ఏసుమని పాల్గొన్నారు.

# తేజ స్కూల్ విద్యార్థులకు క్విజ్‌లో జిల్లా ఫస్ట్

**ప్రజాపక్షం/ కోదాడ:**కోదాడ పట్టణ కాశీనాథం పంక్షన్ హాల్‌లో సోమవారం ఇంటాక్ కంపేనీ వారి అధ్వర్యంలో పాఠశాలలకు చెందిన 7 నుండి 10వ తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ అను రాథారెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు భారతీయ చరిత్ర, సంస్కృతిపై అవగాహన కలిగించేందుకు జిల్లా, రాష్ట్ర , జాతీయ స్థాయిలో ప్రతి సంవత్సవరం పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ప్రథమ స్థానం కోదాడ తేజ విద్యాలయానికి చెందిన వి.రిషిక(10వ తరతగతి), గాయం రేఖశ్రీ(9వ తరతగతి) జట్టు , ద్వితియ స్థానం తేజ విద్యాలయ 9వ తరగతికి చెందిన నితీష్‌రాజ్, అప్నాన్ జట్టు సాధించాయి. విజేతలకు నిర్వహాకులు బహుమతులు అందించారు. విజేతలను పాఠశాల కరస్పడెంట్ రమాసోమిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



# 27లోగా దరఖాస్తు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ఈనెల 27లోగా పారా మెడికల్ కోర్సుల ప్రవేశానికి అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025/26 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని ప్రైవేట్ పారా మెడికల్ కళాశాలల్లో డిప్లమా కోర్సులు హెల్త్ అసిస్టెంట్(మగ), ల్యాబ్ టెక్నిషియన్, ఆప్తమాలజీ, అనస్థిషియా, ఇమేజింగ్ టెక్నిషియన్, రేడియోగ్రాఫీ, ఈసీజీ టెక్నిషియన్, స్టెరిలైజేషన్ టెక్నిషియన్, డయాలసిస్, ఆప్టోమెట్రిస్ట్ కోర్సులు కలవని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు www.tspmb.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# ప్రతీ ధాన్యపు గింజా కొంటాం



ప్రజాపక్షం/సూర్యాపేట (చివ్వెంల) : రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం చివ్వెంల మండలంలోని మొగ్గాయిగూడెం, చందుపట్ల గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, నాయకులు గాయం చంద్రశేఖర్ రెడ్డి, అనిత, కోడిరెక్క కొండల్, గుద్దేటి వెంకన్న, బొడువుల హరికృష్ణ, ముద్ద వెంకన్న, అనంతుల సైదులు పాల్గొన్నారు.

# తన్నీరు సత్యనారాయణ చిత్రపటానికి నివాళులు

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ ఇటీవల మృతి చెందాడు. సోమవారం మాజీ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జడల అమరేందర్ గౌడ్, మాజీ జిల్లా రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు కొల్పుల అమరేందర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సత్యనారాయణ చిత్రపటానికి పువ్వుల మాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుని కలిసి వారికి సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, బిఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, బిఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కాజా అజిముద్దీన్, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు ముజీబ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



# ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం



ప్రజాపక్షం/చిట్యాల: మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని రైల్వే బ్రిడ్జి క్రింద పెద్ద ఎత్తున నీరు చేరి నిల్వ ఉండటంతో గత మూడు రోజులుగా జాతీయ రహదారి 65పై సుమారు 6 కిలో మీటర్ల మేర ట్రాఫిక్ నిలిచి రాకపోకలకు తీవ్ర సమస్య ఏర్పడింది. సమస్యను పరిష్కరించడం కోసం సోమవారం స్థానిక ఆర్‌డిఓ అశోక్‌రెడ్డి రైల్వే బ్రిడ్జి అండర్‌పాస్ దగ్గర పరిస్థితులను పరిశీలించారు. వర్షం నీరు నిల్వ ఉండటానికి పక్కనే గల పోతురాజు కుంట ఆక్రమణకు గురికావడం, అక్కడే మున్సిపాలిటి వారు చెత్తను డంప్ చేయడంగా ఆయన నిర్ధారించారు. నేషనల్ హైవే వారు పోతురాజు కుంటలోకి నీరు సజావుగా తరలివెళ్ళడానికి గతంలో కావల్సిన ఏర్పాట్లు చేసినప్పటికి కుంట ఆక్రమణల కారణంగా నీరు నిల్వ ఉండి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయని నిర్ధారణకు వచ్చారు. కుంట ఆక్రమణలను త్వరలోనే తొలగించి భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామని, పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించి వారి ఆదేశానుసారం చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

# పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు చేపట్టిన కళాశాలల నిరవధిక బంద్ సోమవారం పట్టణంలోని విజేత డిగ్రీ కళాశాల మద్దతు తెలిపి బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఆయా ప్రభుత్వాలు ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందని, అధ్యాపకులు జీవితాలు దిక్కుతోచని స్థితిలోకి నెట్టివేయబడ్డాయని, యాజమాన్యాలు అర్ధాంతరంగా కళాశాలలు మూసుకోవాల్సి వచ్చిందన్నారు. భవిష్యత్తులో పరీక్షలు, ప్రాక్టికల్స్ కూడా నిర్వహించలేమని యాజమాన్యాలు ప్రకటించాయి. అధ్యాపకులు, విద్యార్థులు ఫీజు బకాయిలను విడుదల చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ, వైస్ ప్రిన్సిపాల్ మధు, చారి, యాదయ్య, దుర్గయ్య, హరి, ప్రభాకర్, రమేష్, రాజారాం, సతీష్, వీరయ్య, జ్యోతి, సైదమ్మ, శ్రీరామ్, స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

# బిసి విద్యార్థులను తొలగించడం తగదు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘీక సంక్షేమ శాఖ బాలుర, బాలికల వసతిగృహాల్లో ఉంటున్న బీసీ విద్యార్థులను తొలగించడం తగదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, బీసీ రాజ్యాధికారి సమితి జిల్లా అధ్యక్షుడ కర్నాటి యాదగిరిలు అన్నారు. సోమవారం వారు సాంఘీక సంక్షేమశాఖ జిల్లా అధికారి శశికళపై చర్యలు తీసుకోవాలని నల్లగొండలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా సాంఘీక సంక్షేమ శాఖ వసతిగృహాల్లో విద్యనభ్యసిస్తున్న బీసీ విద్యార్థులను కొత్త సాంఘీక సంక్షేమశాఖ అధికారి ఆదేశాల మేరకు వసతిగృహ అధికారులు తొలగించడం వల్ల విద్యార్థుల చదువు రోడ్డు మీద పడిందన్నారు. అధికారులు విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నారని అన్నారు. వెంటనే తొలగించిన విద్యార్థులను తిరిగి చేర్చుకోని విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సతీష్, రాజేష్, విక్రమ్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాంసాగర్ రెండవ దశ కాల్వకు భీమిరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: వీర తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి నల్లగొండ జిల్లా ఖ్యాతిని నలుదిశలా చాటిన భీమిరెడ్డి నర్సింహారెడ్డి పేరును శ్రీరాంసాగర్ రెండవ దశ కాల్వకు నామకరణం చేయాలని ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సభ్యుడ గోనె కుమారస్వామి అన్నారు. సోమవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో సాగు, తాగునీరు సమస్య జఠిలంగా ఉండి ప్రజలు నిత్యం కరువుతో, ఆకలి చావులతో అల్లాడుతున్న తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ ప్రాంతాలతో పాటు ఖమ్మం, వరంగల్ జిల్లాలో ఎగువ ప్రాంతాలకు శ్రీరాంసాగర్ రెండవ దశ కాల్వ పోచంపాడు నీళ్ల ద్వారా నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలో 4.30లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలని బీఎన్.రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడారని అన్నారు. శ్రీరాంసాగర్ రెండవ దశ కాల్వకు, సూర్యాపేట జిల్లాకు బీఎన్.రెడ్డి పేరు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.30వేల పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ చైర్మన్ నాగెల్లి కొమరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య, నాయకులు వస్కుల సైదమ్మ, పోతుగంటి కాశీ, మోహన్‌నాయక్, చంద్రకళ, మల్లేష్, జ్యోతి, రవి తదితరులు పాల్గొన్నారు.



# బిసి రిజర్వేషన్లు కల్పించాలి

ప్రజాపక్షం/ రామన్నపేట: రాష్ట్రంలోని బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు బందెల అశోక్ అన్నారు. సోమవారం ఆయన లాల్‌బహదూర్‌కు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశ్యంతో అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి కేంద్ర ప్రభుత్వానికి బిల్లు పంపి ఏడు నెలలైనా కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అమలు చేయకుండా చోద్యం చూస్తుందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని అన్నారు. కార్యక్రమంలో పోషబోయిన మల్లేష్‌యాదవ్, నల్ల నరేందర్, మహమ్మద్ జమీరొద్దిన్, మేడి మల్లేష్, అనంతచారి, సుదర్శన్, జినుక గోవర్ధన్, సైదులుయాదవ్, శివరాత్రి సాంబయ్య, భగవంత, దశరథ, సైదులు, మల్లేష్‌యాదవ్, పెండెం రవి, అంజయ్య, అశోక్, స్వామి, నరేందర్ పాల్గొన్నారు.

# 8న భువనగిరిలో సదర్ సమ్మేళనం



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : ఈ నెల 8న భువనగిరిలో శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదర్ సమ్మేళనను విజయవంతం చేయాలని శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేష్ యాదవ్ అన్నారు. భువనగిరిలోని వందన హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమనికి యాదాద్రి భువనగిరి జిల్లాలో అన్ని మండలల నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు యధా మల్లయ్య యాదవ్, గుండెబోయిన సురేష్ యాదవ్, నక్కల చిరంజీవి యాదవ్, జిల్లా కోఆర్డినేట్ ఆవిశెట్టి రమేష్ యాదవ్, జిల్లా యూత్ అధ్యక్షులు ర్యాకల రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

# యాదగిరీశా... సిఎం కళ్లు తెరిపించు!

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి.. సీఎం రేవత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు తెరిపించి దేవస్థానం విలువలను కాపాడమని అంటూ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య వేడుకున్నారు. మూడు నెలల్లో ముగ్గురు ఈవోలు మారడం దురదృష్టకరమన్నారు. ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టిన అధికారుల జాన లేకపోవడంతో కొండపైన దోపిడి పెరిగిందన్నారు. రాష్ట్ర తొలిసీఎం కేసీఆర్ రూ.1300 కోట్లతో స్వామివారి ఆలయాన్ని ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దితే, కాంగ్రెస్ పాలనలో ఆలయం పూర్తిగా దోపిడికి గురవుతుందన్నారు. కేసీఆర్ ఆలోచనకు భిన్నంగా కొండపైన వ్యవహారం కొనసాగుతుందన్నారు. సోమవారం యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లిలో మీడియాతో మాట్లాడారు. ఇటీవల రూ.1.90 లక్షల లంచాన్ని తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కిన దేవస్థాన ఈఈ ఊడేపు వెంకటరామారావుపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలన్నారు. కొండపైన జరిగే ప్రతి కాంట్రాక్టుల్లో ఆలయ అధికారులను ముడుపులు అందనిదే బిల్లులు మంజూరు కావడం లేదన్నారు. ధరలు పెంచి భక్తుల జేబులు గుల్ల చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో కులపాక అశోక్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీద రవీందర్ యాదగిరిగుట్ట పిఎసిఎస్ చైర్మన్ ఇమిడి రామిరెడ్డి నాయకులు మహేందర్ కొలెపాక అశోక్ రేపాక స్వామి బొట్టు రాజు ఆవుల సాయి తదితరులు పాల్గొన్నారు.





## విద్యుదాఘాతంతో మూడు మేకలు మృతి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని గన్య నాయక్ తండాలో హీరా అనే రైతు తన మేకలను రోజు మాదిరిగ సోమవారం మేపేటందుకు తన వ్యవసాయ భూమిలోకి తీసుకెళ్ళగా అక్కడ కరెంటు తీగలు తెగి మేకలపై పడడంతో మూడు మేకలు మృత్యువాత పడ్డట్లు తెలిపాడు. ఈ ప్రమాదంలో హీర తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. తనకు జీవనాధారమైన సుమారు రూ. 80వేల విలువ చేసే మూడు మేకలు చనిపోవడంతో ఏమిచేయాలో పాలుపోవడం లేద న్నారు. విద్యుత్ శాఖ అధికారులు మానవతాధృక్పదం తో స్పందించి తనకు సహాయం చేయాలని కోరారు.

## నేలకొరిగిన పొలాలను పరిశీలించిన అధికారులు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ఇటీవల మొంథా తుఫాను ప్రభావంతో మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో కురిసిన భారీ వర్షాలకు వరి పొలాలు, పత్తి తీవ్రంగా దెబ్బతిన్నది. ఆర్డీవో రమణారెడ్డి, కొండ మల్లేపల్లి తహశీల్దార్ నరేందర్‌ల ఆదేశానుసారం సోమవారం ఆర్ఐ ఐశ్వర్యరెడ్డి, జీపివో హమీద్‌లు మండల పరిధిలోని గుడితండా, హర్యతండాలలో నీట మునిగిని సుమారు 30 మంది రైతులకు చెందిన 70 ఎకరాల పంట పొలాలను పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేసి పై అధికారులకు పంపనున్నట్లు వారు తెలిపారు. వారి వెంట మత్స్య సంఘం చైర్మన్ సక్రంనాయక్, రైతులు అమర్‌సింగ్, సుభాష్‌చంద్ర బోస్, శ్రీను, నగేష్, వెంకట్‌నాయక్ ఉన్నారు.

## ప్రైవేట్ కళాశాలల అధ్యాపకుల నిరసన

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ప్రభుత్వం గత మూడు సంవత్సరముల నుండి విద్యార్థుల ఉపకార వేతనాలు, కళాశాలల బోధన రుసుములు చెల్లించకపోవడంతో కళాశాలలు నిర్వహించలేక సోమవారం కళాశాలలను బంద్ చేసి నిరసన వ్యక్తం చేశామని స్థానిక శ్రీ క్రాంతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుంటోజు ఆంజనేయులు తెలిపారు. ప్రైవేట్ కళాశాలల యజమాన్య సంఘం రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఈ బంద్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీక్రాంతి జూని యర్ కళాశాల ప్రిన్సిపాల్ దుండిగళ్ళ అశోక్, చిన్నానా యక్, నరేంద్రాచారి, దీపక్, నాగయ్య, శేఖర్, నిఖిత తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలం వెంక టాపురం గ్రామంలోని శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎంపీ నిధుల ద్వారా నిర్మించబడిన మత్స్యగిరి గుట్ట ఘాట్ రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన రేలింగ్ పనులను కొబ్బ రికాయ కొట్టి ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ రహదారి మరియు రేలింగ్ ఏర్పాటు వల్ల భక్తులు సురక్షితంగా స్వామివారి దర్శనానికి చేరుకునేలా సౌకర్యం కలుగుతుంది. ప్రజల అవసరా లను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి అభివృద్ధి కార్యక్ర మాలు కొనసాగిస్తామని హామీ ఇస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వా హన అధికారి సల్వాది మోహన్ బాబు, ఆలయ చైర్మన్ కొమ్మారెడ్డి, నరేష్ కుమార్ రెడ్డి, ధర్మకర్తలు కొడితాల కరుణాకర్, అర్రూర్ వెంకటేష్, రేఖల ప్రభాకర్, బండి రవికుమార్, గుండు జగన్ మోహన్ రెడ్డి, అంబాల ఊషయ్య, ఈతాప రాములు, జక్కల కేతమ్మ, మైసోళ్ళ వెంకటేశం, కొమిరె బాలేశ్వర్, కందుల శ్రీను, స్థానిక ప్రతినిధులు, గ్రామ పెద్దలు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పుల్లారావుకు రాష్ట్రబెస్ట్ కమ్యూనిటీ సర్వీసెస్ అవార్డు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రముఖ కంటి వైద్య నిపుణులు మాజీ తెలంగాణ రాష్ట్ర ఇండియన్ మెడి కల్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా రావు చేసిన అనేక సామాజిక కార్యక్రమాలను గుర్తించి తెలంగాణ రాష్ట్రబెస్ట్ కమ్యూనిటీ సర్వీసెస్ అవార్డును అందజేశారు. ఆదివారం కరీంనగర్ లో జరిగినటువంటి ఐఎంఏ సదస్సు,డాక్టర్ల సమ్మేళనలో మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ,కరీంనగర్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి చేతుల మీదుగా డాక్టర్ పుల్లారావు అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు తనకు బాధ్యత పెన్ తెచ్చిం దని ఇంకా బాధ్యతతో సామాజిక కార్యక్రమాలు పేద ప్రజలకు ఉచిత కంటి వైద్యం శిబిరాలు చికిత్సలు అలాగే నేత్రదాన ప్రోత్సాహక ప్రోగ్రామ్స్ చేస్తానని తెలిపారు.నిరంతరం రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, ఉచితంగా కంటి చికిత్సలు, కంటి ఆపరే షన్స్ చేయడం ప్రభుత్వ,ప్రైవేటుకు సంబంధించిన అన్ని రకాల ఆరోగ్య సమస్యలపై అవగాహన సద స్సులు, ర్యాలీలు, అలాగే ఈ సంవత్సరం లో 227నే త్రాలను సేకరించి450 పైచిలుకు అందులకు చూపు ఇవ్వటంలో భాగస్వామ్యం అయినందుకు అవార్డు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

# తక్షణమే తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలి



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను పెంచుతూ చేసిన బిల్లులను తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని బహుజన వేదిక రాష్ట్ర కన్వీనర్ కస్తూరి రాములు డిమాండ్ చేశారు. సోమవారం రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావే శాల్లో బిసి రిజర్వేషన్ బిల్లులు 9వ షెడ్యూల్లో చేర్చా లని కోరుతూ కోదాడ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్‌లో ఉప వర్గీకరణ చేసి, అత్యంత వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయ కులు పొట్ట జగన్మోహన్‌రావు, బొడ్డు వీరయ్య, తమ్మ నబోయిన వీరబాబు, సారగండ్ల సత్తయ్య, ఆర్ రామ నర్సయ్య, వరకాల జానయ్య, వేముల కోటయ్య, గుండ్లపల్లి రంగారావు, గడ్డం నర్సయ్య, తిరుపతమ్మ పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణ

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** అయ్యప్ప దీక్ష తీసుకున్న స్వాములకు సోమవారం అలుగుబెల్లి మల్లారెడ్డి మమత దంపతులు శ్రీసీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం దంపతులను చిట్టెడి ప్రభాకర్‌రెడ్డి గురు స్వామి అయ్యప్పస్వాములతో కలిసి సన్మానించి, ఆశీర్వ దించారు. ఈకార్యక్రమంలో భూతరాజు సత్తయ్య స్వామి, బత్తుల విజయ్‌స్వామి, రమేష్‌స్వామి, గణేష్ స్వామి, నర్సింహాస్వామి, బోడ నగేష్‌స్వామి, జంగయ్య స్వామి, గుమ్మడవెల్లి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులపై అవగాహన

**ప్రజాపక్షం/అర్వపల్లి :** సీజనల్ వ్యాధులు, పరి సరాల పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాజాత బృందం సభ్యులు తెలిపారు. సోమ వారం మండల కేంద్రంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మలేరియా, టైఫాయిడ్ ఇతర వ్యాధులు వ్యాపించే విధానం వివరించారు. 6 గ్యారంటీల సంక్షేమ పథకా లపై పాటల రూపంలో వివరించారు. ఈ కార్య క్రమంలో వెన్నెల నాగరాజు, ఈర్ల సైదులు, వేముల శ్రవణ్, మేడిపల్లి వేణు, లక్ష్మి, ప్రియాంక, స్రవంతి పాల్గొన్నారు.





## రోగులకు పండ్లు పంపిణీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముడుంబై రామానుజాచార్యులు ద్వితీయ వర్ధంతి సంద ర్భంగా సోమవారం రామచంద్రగూడెంలోని టీకేవీ రంగాచార్యులు రంగనాయకమ్మ లయన్ కంటి ఆసుపత్రిలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐ ఆసుపత్రి అధ్యక్ష, కార్యదర్శులు ముక్కపాటి వెంకటేశ్వర్లు, లయన్ పాశం రవీందర్‌రెడ్డిలు మాట్లాడుతూ కోట్ల రూపాయల విలువ చేసే స్థలాన్ని సేవా దృక్పదంతో లయన్స్‌క్లబ్ వారికి అందించి పేదలకు కంటి వైద్య పరీక్షల కోసం రాష్ట్రంలోనే ఖరీదైన ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేసిన మహనీయుడు ముడుంబై రామానుజాచార్యులు అని కొనియాడారు. అనంతరం ఆసుపత్రి లోని రోగులకు పండ్లు అందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, అనంతరెడ్డి, బంటు సైదులు, వెంకటే శ్వర్లు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని ఆమనగల్లు లక్ష్మీదేవి గూడెంలో ఐకెపి కేంద్రాలను ఏపిఎం జానకి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆమనగల్లు లక్ష్మీదేవి గూడెం పరిసర ప్రాంత రైతులు ఐకెపి కేంద్రాలను వినియోగించుకోవాలని అన్నారు, రైతులు తెచ్చిన ధాన్యం ను మచర్ ప్రకారం కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులు తీసుకొచ్చిన ధాన్యం రాశులను ఏరోజుకారోజు కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఓ కిషన్ నాయక్, ఏఈఓ నితిన్ నాయక్, డిటిఎస్ సైదులు,సంఘం బంధం అధ్యక్షురాలు నాగమణి, ఐకెపి నిర్వాహకులు సంధ్య,లక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ మూలంగా తడిసిన ధాన్యాన్ని, పత్తిని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సంఘం జిల్లా కమిటి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. తుఫాన్ మూలంగా నష్టపోయిన రైతుల యొక్క పంటను అంచనావేసి రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజే శారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందాల శంకర్ రెడ్డి, కొలి శెట్టి యాదగిరి రావు, పారేపల్లి శేఖర్ రావు, మేదరమెట్ల వెంకటేశ్వ రరావు, దండా వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్లకు మరమ్మతులు చేయాలి

**ప్రజాపక్షం/గుండాల;** ఇటీవల మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు గుండాల మండల వ్యాప్తంగా అన్ని గ్రా మాలలో రోడ్లు తీవ్రంగా దెబ్బతిని ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతూ, ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వర్షాల వలన దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు మద్దెపురం రాజు ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం, అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరారు.



## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ అన్నారు. తుఫాన్ ప్రభావంతో హుజూర్‌నగర్ ప్రాంతంలో పడిపోయిన పంట పొలాలను సోమవారం పలువురు రైతులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. అనంతరం ఏఈఓ రమ్యతో మాట్లాడి ఎకరాకు రూ.50వేలకు తగ్గకుండా నష్టపరిహారం ఇప్పించాలని రిపోర్టు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని రైతుల పక్షాన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతలపూడి ఉమామహేశ్వరరావు, కుందూరు కోటిరెడ్డి, జనిగల శ్రీనివాస్ గౌడ్, గుండా గోపి, కంటు నాగరాజు, బల్వంత్‌సింగ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

## సిఆర్‌పి రమేష్ మృతి బాధాకరం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** సిఆర్‌పి రమేష్ మృతి బాధాకరమని హుజూర్‌నగర్ ఎంఈఓ భూక్యా సైదా నాయక్ అన్నారు. మండల పరిధిలోని లింగగిరి కాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తున్న సిఆర్‌పి రమేష్ (41) ఆదివారం రాత్రి అకాల మరణం చెందారు. సోమవారం ఆయన పార్థివ దేహానికి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమేష్ వృత్తిపట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌ఓ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బీరెల్లి శ్రీనివాసరెడ్డి, లింగగిరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పెనుగొండ శ్రీనివాస్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నలబోలు శ్రీనివాసరెడ్డి, దాడి నర్సిరెడ్డి, జహూరే అలం, తాతరాజు శ్రీనివాస్, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, సిఆర్‌పిలు సైదులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పైళ్ల శేఖర్ రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** జూబ్లీహిల్స్ ఎలక్షన్ల ప్రచారంలో భాగంగా మాగంటి సునీత గోపీనాథ్ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ డివిజన్ స్వరాజ్ నగర్ 330,331,332 బూతుల ఎలక్షన్ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మెన్ జడల అమరేందర్ గౌడ్, మాజీ జిల్లా రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు కొల్పుల అమరేందర్, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఎన్నబోయిన ఆంజనేయులు, బిఆర్‌ఎస్ పార్టీ పట్టణ & మండల అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, జనగాం పాండు పాల్గొన్నారు.





## బిసి విద్యార్థులను హాస్టల్లో చేర్చుకోవాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న బిసి విద్యార్థులను తొలగించడం పట్ల సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బిసి రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షులు కర్నాటి యాదగిరి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా కర్నాటి యాదగిరి,విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్‌లు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా సాంఘిక సంక్షేమ వసతిగృహాలలో విద్యనభ్యసిస్తున్న బీసీ విద్యార్థులను కొత్త సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఆదేశాల మేరకు వసతి గృహ అధికారులు తొలగించడం వల్ల విద్యార్థులు చదువు రోడ్డు మీద పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థి చదువుకొని రాష్ట్రం అక్షరాస్యతలో 100 కి 100 సాధించాలని చెప్పి ప్రభుత్వం పోరాడుతుంటే కింది స్థాయిలో ఇలాంటి అధికారులు విద్యార్థుల జీవితాలను చిత్రం చేసి విద్యకు దూరం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సుమారు జిల్లా వ్యాప్తంగా 150 మంది విద్యార్థులను ఈరోజు వసతిగృహాల నుండి తొలగించి వారిని విద్యకు దూరం చేసే పరిస్థితి తయారు చేశారని తెలిపారు. నాంపల్లి, తిప్పర్తి, నల్లగొండ, మిర్యాలగూడ, నిడమనూరు అనేక సాంఘిక సంక్షేమ వసతి గృహాల లో తొలగించడం జరిగిందని తక్షణమే తొలగించిన విద్యార్థులందరినీ మళ్లీ హాస్టల్లో చేర్చుకొని వారి ఇబ్బందుల్ని తొలగించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు సతీష్ నేత, రాజేష్, విక్రమ్, శ్రీనివాస్ ముదిరాజ్, నాగరాజు పాల్గొన్నారు.

## పంట దెబ్బ తిన్న రైతులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/చిట్యాల:** మొంథా తుఫాను వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్యలు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో రెవిన్యూ అధికారికి వినతి పత్రాన్ని అందజేసిన సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ కారణంగా వరి కోత సమయంలో మొకాళ్ళ లోతు వరకు నీరు నిల్వ ఉండిపోయాయని, వరి ధాన్యం మొలకెత్తిందని, పత్తి, కూరగాయల పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే యుద్ధ ప్రాతిపదికన దెబ్బ తిన్న పంటలకు ఎకరాకు రూ. 50వేలు, వాణిజ్య పంటలకు రూ. 75వేలు, ఉద్యానవన పంటలకు రూ. 1లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు ఐతరాజు నర్సింహ్మా, బాతరాజు గోపాల్, చొప్పరి మల్లేషం, నోముల నర్సింహ్మాపాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. భువనగిరి బిజెపి మండల శాఖ అధ్యక్షులు చీర్క సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలో గల తుక్కాపురం గ్రామంలో ఐకెపి సెంటర్‌ను బిజెపి శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం నరసయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా రైతులకు తీవ్ర నష్టం జరిగిందని దీనిని ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని అన్నారు. రైతులకు బోనస్‌గా ఇస్తా నన్న రూ.500 వెంటనే చెల్లించాలని అన్నారు. అలాగే రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం వెంటనే అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, పడమటి జగన్మోహన్ రెడ్డి, చంద మహేందర్, మండల ఇంచార్జ్ జైనపల్లి శ్యాంసుందర్ రెడ్డి, పట్నం శ్రీనివాస్, ఫకీర్ రాజేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు నాగు వినోద్ కుమార్, మాటూరి అనిల్ గౌడ్ పాల్గొన్నారు.

## 'బేటీ బచావో బేటి పడావో'పై అవగాహన



**ప్రజాపక్షం/మర్రిగూడ :** దామెర భీమనపల్లి ,నామాపురం అంగన్వాడీ కేంద్రాలలో, జడిపిహెచ్ఎస్ దామెర భీమనపల్లిలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్లు యశోద,శ్రీలతలు మాట్లాడుతూ శిశు విక్రయాలు,అత్యాచారాలు,భ్రూణ హత్యలు ఎట్టి పరిస్థితులలో జరగకూడదని, అదేవిధంగా బాల్యవివాహాలు జరగకుండా చూసుకోవాలన్నారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాలలోపు మగ పిల్లలకు వివాహం చేయడం చట్టరీత్య నేరం అని వివరించారు. చట్టవిరుద్ధంగా పిల్లలను పెంచుకోవడం నేరమని,పిల్లలను దత్తత తీసుకోవలసిన వాళ్లు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. అనంతరం తల్లులు పిల్లలు జడిపిహెచ్ఎస్ స్కూల్ ఉపాధ్యాయ స్టాఫ్, ఆడపిల్లను రక్షిద్దాం చదివిద్దాం 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేద్దాం అను ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం లచ్చిరాం ,అంగన్వాడీ టీచర్లు మరియమ్మ ,లక్ష్మి తల్లులు పాల్గొన్నారు,

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

**ప్రజాపక్షం/ రామన్నపేట:** ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 15 వరకు వార్షిక పరీక్షలు నిర్వహించే తేదీలు ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించడంతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి నూరుశాతం విద్యార్థులు ఉత్తీర్ణ పొందడానికి కృషి చేస్తున్నట్లు రామన్నపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సి.జగదీష్ తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్నందున విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా బాగా చదువుకొని ఉత్తీర్ణత పొందడానికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో చదువుకొని పరీక్షలు రాసిన విద్యార్థులందరు ఉతీర్ణత సాధించినట్లు తెలిపారు.

## సాయిబాబా జీవిత చరిత్ర నాటక ప్రదర్శన



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో కాకినాడకు చెందిన కళాకారుల బృందం షిర్డి సాయిబాబా సంపూర్ణ జీవిత చరిత్ర నాటకాన్ని ఆదివారం రాత్రి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో సాయిబాబా చిన్నతనం నుండి శరీరాన్ని విడిచేంత వరకు జరిగిన ముఖ్యమైన సన్నివేశాలను కళ్ళకు కట్టినట్లుగా ప్రదర్శించారు. కళాకారుల నటన చూపరులను ఆకట్టుకుంది. గురూజీ అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన నాటక ప్రదర్శనకు బాబా భక్తులు అధిక సంఖ్యలో హాజరై వీక్షించారు. ఈ కార్యక్రమంలో సాయి గురు కెవిబి స్వామి, సాయి పురోహిత్ విరమణ మూర్తి, సాయి సేవకులు శకుంతల భోజరాజు, వాణి, హైమ, నర్మద, లక్ష్మి దుర్గ, అనురాగ్, గాంధీ, సేవకులు రేగొండ వేణుమాధవ్, ఇమ్మడి వెంకన్న, కుర్రె రవి, గంధం భాస్కర్, నాగేశ్వర్‌రావు, దీప, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## విప్లవాలకు అంతం లేదు

**ప్రజాపక్షం/మోటకొండూరు :** ప్రజలు సాగిస్తున్న విప్లవాన్ని అంతం చేయడం విప్లవోద్యమ చరిత్రలో ఎన్నడూ జరగలేదని, నేడు బీజేపీ మోదీ, అమిత్ షాలు ఆపరేషన్ కగార్ పేరుతో సాగిస్తున్న రాజ్యాంగ, చట్ట వ్యతిరేక, అప్రజాస్వామిక హంతక చర్యల ద్వారా ప్రాణాలతో పట్టుకొని చిత్ర హింసలకు గురి చేసి బూటకపు ఎన్‌కౌంటర్‌లలో చంపినా విప్లవం ఏనాడు నిర్మూలించబడదని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్. జనార్ధన్ అన్నారు. ఆయన సోమవారం మోటకొండూర్ మండలంలోని ఇక్కుర్తిలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు చిరబోయిన కొమురయ్య, గ్రామ కమిటీ కార్యదర్శి సాదుల శ్రీకాంత్‌లు రెండు చోట్ల జండాలను ఆవిష్కరించి, అమరవీరులకు రెండు నిమిషాలు సంతాప సూచకంగా మౌనం పాటించి ఘనంగా విప్లవ జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య పరిష్కారమే లక్ష్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లాలో ఉన్న ప్రతి విద్యుత్ సమస్యను పరిష్కారం చేయడమే తమ లక్ష్యమని సూర్యాపేట ఎస్ఇ ఫ్రాంక్లిన్ అన్నారు. సోమవారం సూర్యాపేట విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో మీటర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. విద్యుత్ పౌరపత్రంలో చెప్పిన విధంగా పనులు చేయకపోతే అధికారులపై కోర్టులో వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఈ శ్రీనివాస్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

# జోరుగా ఇసుక రవాణా..!

- కిన్నెరసాని పరివాహక ప్రాంతాలే లక్ష్యం
- కిలోమీటర్‌కు ఒకరు కాపలా
- నిఘా నీడలో తరలింపు - స్థాయిని బట్టి ముడుపులు..!
- పట్టించుకోని అధికారులు





**ప్రజాపక్షం/పాల్వంచ :** దొంగలు దొంగలు ఊర్లు పంచుకొన్న చందాన పలువురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి గత కొన్ని రోజులుగా కిన్నెరసాని వాగు ఇసుకను దోచుకుపోతున్నారు. ఒకరేమో రంగాపురం సమీపం నుండి, మరొకరేమో నాగారం రెవిన్యూ పరిధి నుండి, మరొకరేమో సీతారామ ప్రాజెక్టు కాలువ సమీపం నుండి ఇసుకను దొరికినంత దోపిడి చేస్తున్నారు. గత నెల 26వ, తేదీ రాత్రి సమయంలో పోలీస్ అధికారులు రంగాపురంలో రాత్రి వేళల్లో వాహన తనిఖీలు చేసున్నారు. పోలీస్ అధికారులంటే లెక్కలేకుండా, ఎంతమాత్రం భయం లేకుండా వారి కండ్లు గప్పి మరో చోటు నుండి ఇసుక తరలించుకుపోతున్నారంటే వారు ఎంతకు తెగబడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఉపేక్షిస్తే మరింత ప్రమాదకరంగా మారుతారని దీనికి ఎప్పటికప్పుడు నియంత్రించాలంటున్నారు. ఏ అధికారి సైతం వారిని అడ్డుకోలేరనే ధీమా ఒకవైపు, అధికారులకు వారి స్థాయిని బట్టి ముడుపులు చెల్లించామంటూ పలు ఆరోపణలు చేసుకొంటూ ధర్జాగా అక్రమానికి తెగబడుతున్నారు. పాల్వంచ పట్టణ కేంద్రంతో పాటుగా దానికి సమీపంలోని గ్రామీణ ప్రాంతాలైన, లక్ష్మిదేవిపల్లి, బసవతారక కాలని, పెద్దమ్మతల్లి దేవాలయం కేశవాపురం, జగన్నాధపురం తదితర ప్రాంతాలలో ఇంటి నిర్మాణాలతో పాటుగా కమర్షియల్ నిర్మాణాలు సాగుతున్నాయి. వీటికి తోడుగా ఇండ్లు లేని పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణాలు ఊపందుకొన్నాయి. కావలసిన ఇసుక ర్యాంపులు మండలంలో లేకపోవటం ఇసుకాసురులకు వరమైనది. అవకాశాలను అనుకూలంగా మార్చుకొన్నారు. కిన్నెరసాని పరీవాహక ప్రాంతాలైన రంగాపురం, నాగారం, దంతెలబోర తదితర ప్రాంతాలే లక్ష్యంగా చేసుకొని అక్రమ ఇసుక రవాణాకు తెరలేపారు. రాత్రి 7 గంటల నుండి పది గంటల వరకు ట్రాక్టర్లతో తమకు అనుకూలమైన ప్రాంతాలలో ఇసుకను డంప్ చేస్తారు. అనంతరం జేసిబి లాంటి యంత్రాలతో టిప్పర్‌లకు ఎత్తి పాల్వంచ, పాల్వంచ మీదుగా కొత్తగూడెం, ఖమ్మం తదితర పట్టణాలకు రవాణా చేస్తున్నారు. దొంగలు, దొంగలు ఊర్లు పంచుకొన్న చందాన బూర్గంపాడు, మోరంపల్లి బంజెర, పాల్వంచ, రంగాపురం గ్రామాలకు చెందిన కొందరు టిప్పర్ యాజమానులు ఇసుక రవాణా చేయటానికి సిండికేట్‌గా ఏర్పడ్డారు. విలువైన ఇసుకపై కన్నేశారు. తమ ఆర్థిక, రాజకీయ పలుకుబడితో అధికారులను మచ్చిక చేసుకొని నిఘా నీడలో ఇసుక రవాణాకు పాల్పడుతూ లక్షల సొమ్మును అందిన కాడికి దోచుకొంటున్నారు. రంగాపురం సమీపంలోని ఓ మామిడి తోటను అడ్డాగా చేసుకొన్న అక్రమార్కులు అక్కడి నుండి ప్రతీ రోజు పదుల సంఖ్యలో టిప్పర్లతో వందలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ సొమ్మున యదేశ్చగా దోచుకుపోతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి వారి మనుషులతో పాల్వంచ నుండి మొదలుకొని కిలో మీటర్‌కు ఒకరు చొప్పున ఉంటూ అధికారుల రాకను పసిగడుతూ నిత్యం నిఘా నీడలో తరలించుకుపోతున్నారు.

# శీతాకాలం హైబిపి పేషెంట్లు అప్రమత్తంగా ఉండాలి

- బత్తినేని ట్రస్ట్ సౌజన్యంతో 62 బీపీ, షుగర్ క్యాంపు విజయవంతం
- ట్రస్ట్ సేవలు అభినందనీయం
- ప్రముఖ వైద్యులు టి పవన్‌కుమార్, కిరణ్‌కుమార్ గుదిగొండ








**ప్రజాపక్షం/బోనకల్:** శీతాకాలంలో హైబీపీ పేషంట్లు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ బిపి, షుగర్, జనరల్ వైద్య నిపుణులు టి పవన్‌కుమార్, దుర్గ విరించి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత, ప్రముఖ కార్డియాలజిస్ట్ కిరణ్‌కుమార్ గుదిగొండ లు తెలిపారు. మండల కేంద్రంలో ప్రతినెల మొదటి ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం నిర్వహంచే బిపి, షుగర్, కంటి ప్రత్యేక క్యాంపు అదివారం విజయవంతమైంది. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు టి పవన్‌కుమార్, కిరణ్‌కుమార్ గుదిగొండ లు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో హై బీపీ అనేది చాలా మందికి వస్తోందని, ఒకప్పుడు కేవలం వయస్సు మీద పడిన వాళ్లకే వచ్చేదని అన్నారు. కానీ ఇప్పుడు యుక్త వయస్సులో ఉన్నవారు కూడా హైబిపీ బారిన పడుతున్నారని అన్నారు. ఇందుకు ఒత్తిడే ప్రధాన కారణమని తెలుస్తోందని, దీని వల్ల చాలా మందికి గుండె జబ్బులతో పాటు హార్ట్ ఎటాక్‌లు వస్తున్నాయన్నారు. దీంతో యుక్త వయస్సులోనే ప్రాణాలు కోల్పోతున్నారని, కనున ఎవరికైనా హైబిపి ఉంటే అసలు నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. పలు అధ్యయనాల ప్రకారం చలికాలంలో హార్ట్ ఎటాక్ వస్తాయని తేలిందని, ఈ సీజన్ రక్త ప్రసరణ సరిగ్గా ఉండదని, దీంతో బిపి పెరుగుతుందని పేర్కొన్నారు. కాబట్టి చలికాలంలో ప్రతి ఒక్కరూ తమ గుండె ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాల్సి ఉంటుందని అన్నారు. చలికాలంలో శరీరానికి తగినత రక్త సరఫరా చేసేందుకు, వెచ్చదనంగా ఉచ్చేందుకు గుండెకు పనిపెరుగుతుందని తెలిపారు. దీంతో కండరాలకు ఆక్సిజన్, పోషకాల సరఫరా తగ్గుతుందని, దీని వల్ల బ్లడ్ ప్రెజర్ అధికమవ్వడం, రక్తగడ్డ కట్టే ప్రమాదం పెరుగుతుందని తెలిపారు. ఛాతినొప్పి, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది, ఎగువశరీర ప్రాంతాల్లో నొప్పి, వికారం, వాంతులు, కళ్లు తిరగడం, చల్లని చెమట వంటి లక్షణాలు కన్పిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. బిపి, షుగర్ పేషంట్లతో పాటు అధికంగా మాంసం తినేవారు, అధికంగా మద్యం త్రాగేవారు యేడాది ఒక్కసారైనా కనీసం ఈసీజీ, టుడి ఈఓ, టిఎంటీ, లిపిడ్ ప్రొఫైల్, హెచ్‌బిఎ1సి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఐదేళ్లుగా నిర్విరామంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు బిపి, షుగర్, కంటి ప్రత్యేక క్యాంపును రూపొందించి వైద్యసేవలు అందిస్తున్న బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని కొనియాడారు. క్యాంపులో వైద్యులు 100 మంది పేషంట్లకు బిపి, షుగర్, క్రియాటిన్, హిమోగ్లోబిన్, టుడిఈఓ, ఈసిజీలు పరీక్షలు నిర్వహించి వైద్య పరీక్షలు అందించగా, మందులను ట్రస్ట్ సభ్యులు తూము రోషన్‌కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆర్ఎంపిడబ్ల్యూఏ టిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఏలూరి పూర్ణచంద్రరావు, మాతంగి శ్రీనివాసరావు, ఆకెన పవన్, సిపిఎం నాయకులు షేక్ నజీరు, క్యాంపు సహాయకులు యంగల గిరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక మాసం సందర్భంగా రుద్రాభిషేకం

**ప్రజాపక్షం/డిండి;** కార్తీక సోమవారం పురస్కరించుకొని డిండి మండలంలోని ఖానాపూరం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ హరిత సోమామనాదేశ్వర, శ్రీ సీతా రామాంజనేయుయ స్వామి దేవస్థానంలోని మర్కత లింగమునకు రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకం దాదాపు రెండు గంటల ముప్పది నిమిషాల పాటు ఎకబిగినా నిర్వహించారు. 9లీటర్ల దేశియ ఆవుపాలను దారపాతంగా శృంగి ద్వారా జరిగే మహా అద్భుతమైన గట్టం తిలకించడం మహా పుణ్యప్రదం అవుతుందని నిర్వహకులు తెలిపారు.

## నాణ్యతతో పాటు నమ్మకాన్ని కలిగించాలి




**ప్రజాపక్షం/బీబీనగర్ :** వినియోగదారులకు నాణ్యతతో పాటు నమ్మకాన్ని కలిగించాలని హిందుస్థాన్ శానిటైర్ వేర్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ వివేక్ తివారి అన్నారు. సోమవారం పరిశ్రమలో నాణ్యత వారోత్సవాల సందర్భంగా జెండా ఆవిష్కరించిన అనంతరం కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్మికులు నాణ్యత పరిమాణాల పైన శ్రద్ధతో పనిచేసి వినియోగదారులకు నమ్మకాన్ని కలిగించినప్పుడే సమస్త అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. కార్మిక సంఘం అధ్యక్షులు గాదె నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉత్పత్తితోపాటు కార్మికుల సంక్షేమం కోసం యాజమాన్యం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 15న ప్రత్యేక లోక్ అదాలత్

### -జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ రాజగోపాల్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నవంబర్ 15న ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు రాజీ చేసుకోవాలనుకునే వారు దీనిని సద్వినియోగం చేసుకుని కోర్టు కేసుల నుంచి ఉపశమనం పొందాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి. రాజగోపాల్ తెలిపారు. ఖమ్మం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహణపై సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి. రాజగోపాల్ పోలీస్, బ్యాంకర్లు, చిట్‌ఫండ్ ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ రాజగోపాల్ మాట్లాడుతూ లీగల్ సర్వీస్ అథారిటీ తరుపున ప్రతి మూడు నెలలకు ఒకసారి జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజీ చేసుకోవాలనుకునే క్రిమినల్, ఇతర కేసులకు లోక్ అదాలత్ ఒక వేదికగా నిలుస్తుందన్నారు. యాక్సిడెంట్స్, భార్యభర్తల వివాదాలు, చెక్‌బౌన్స్ వంటి వివిధ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చునన్నారు. ప్రమాద కేసులు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుంటే ఒకేసారి పరిహారం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకున్న కేసుల్లో మళ్లి ఉన్నత కోర్టులకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉండదన్నారు. లోక్ అదాలత్ పట్ల గ్రామీణ ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నవంబర్ 15న జిల్లాలోని అన్ని కోర్టులలో ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించడం జరుగుతుందని దీనిని ప్రజలు వినియోగించుకుని కేసులు రాజీ చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఉమ, న్యాయమూర్తులు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. వెంకటేశ్వరరావు, నామినెటెడ్ సభ్యులు, న్యాయవాదులు శ్రీనివాసరావు, సంధ్యారాణి, పోలీస్, ఎక్సైజ్, బ్యాంక్ అధికారులు, న్యాయ వాదులు, చిట్‌ఫండ్, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రెల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నిషేదిత గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ప్రభుత్వ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక జిఆర్‌పి సిఐ ఎన్ అంజలి సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. సూపరిండెంట్ అఫ్ రైల్వే పోలీసు సికింద్రబాద్, డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు కాజిపేట వారి ఆదేశాల మేరకు ఖమ్మం జిఆర్‌పి సిఐ అంజలి, డోర్నకల్లు ఎస్సై జె. సురేష్, రైల్వే ప్రోటక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి ఖమ్మం రైల్వేస్టేషన్ రెండవ నెంబర్ ప్లాటుఫాం మీద బుధవారం తనిఖీలు చేస్తుండగా పుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద బ్యాగులు ధరించి అనుమానాస్పందంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను నిలవరించి తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభ్యమైందని తెలిపారు. స్టేషన్‌కు తరలించి విచారించగా ఒరిస్సాకు చెందిన సోమానత్‌నాగా, సునిల్‌కునారా లు తమ రాష్ట్రంలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి సోలాపుర్‌లో ఎక్కువ ధరకు దానిని విక్రయించి సోమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఒరిస్సాలో పది కేజీల గంజాయిని కొనుగోలు చేసి ఐదు ప్యాకెట్లలో భద్రపరిచి భువనేశ్వర్‌లో ఆదివారం సోలాపుర్ వెళ్లేందుకు కొణార్క్ ఎస్ ప్రెస్ ఎక్కినట్లు తెలిపారు. టికెట్టు లేకుండా ప్రయాణిస్తుండటంతో తనిఖీకి వచ్చిని టిసి వారిని ఖమ్మంలో దింపివేయడంతో వారు మరో రైలు ఎక్కేందుకు ఖమ్మం రెండవ నెంబర్ ప్లాట్‌ఫాం పై వేచిచూస్తుండగా సోమవారం ఉదయం తనిఖీలు చేస్తున్న స్థానిక జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ సిబ్బందికి వారు పట్టుబడినట్లు అంజలి వివరించారు. వీరి నుంచి 5,15,000/ రూపాయల విలువ చేసే 10.18 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కాజిపేట రైల్వేకోర్టుకు తరలించినట్లు తెలిపారు.